

**02**

## ఆపన్నులకు సీఎంఆర్ఎఫ్ అండ

21 మంది లబ్ధిదారులకు
రూ.8.13 లక్షల చెక్కుల పంపిణీ



# భూములు కోల్పోయిన 93 మంది రైతులకు ఇళ్ల పట్టాలు..

## - కొండాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో పట్టాల పంపిణీ..






**కొండాపూర్ ప్రజా జ్యోతి**

భూములు కోల్పోయిన 93 మంది రైతులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని కొండాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.లబ్ధిదారులకు సిడీసీ, ఆత్మ కమిటీ చైర్మన్ , తాసిల్దార్ ల చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను అందజేశారు.ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.


మిగతా 2 లో







# భూములు కోల్పోయిన 93 మంది రైతులకు ఇళ్ల పట్టాలు..

మొదటిపేజీ తరువాయి

భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా వారికి భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.





తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ..



భూములు కోల్పోయిన 93 మంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాలు అందిస్తున్నామని చెప్పారు. ఇళ్ల పట్టాలు పొందిన కుటుంబాలు వాటిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందించే ఇతర సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి ,సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, తాసిల్దార్ అశోక్, తోగర్ పల్లి సర్పంచ్ దివ్య వాణి, అలియాబాద్ సర్పంచ్ లక్ష్మి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అశోక్, ప్రభుదాస్, నర్సింలు, సునీల్, గోపాల్, నాగేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, రెవెన్యూ సిబ్బంది కార్యకర్తలు నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్నులకు సీఎంఆర్ఎఫ్ అండ

మొదటిపేజీ తరువాయి

**అందోల్, సెప్టెంబర్ 23, (ప్రజాజ్యోతి):**



అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆపన్నహస్తంగా నిలుస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. బుధవారం జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందోలు మండలానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 8,13,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ.. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఖరీదైన వైద్య చికిత్సలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం కొంతమేర ఉపశమనం కలిగిస్తుందన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంసాన్‌పల్లి సర్పంచ్ హనుమంతు, మసాన్‌పల్లి మాజీ సర్పంచ్ అశోక్, రాంసాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సార కిషన్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాగులు, వంకలు ఉగ్రరూపం..

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక .!

- నల్లవాగు ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో - ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలతో 2,040 క్యూసెక్కుల ప్రవాహం







**కల్హేర్ , సెప్టెంబర్ 23:. ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా లోని కల్హే ర్ మండలం కేంద్రం లోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం ప్రాజెక్టుకు 2,040 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ మల్లేశం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,493 అడుగులు కాగా, ప్రస్తుతం 1,493.7 అడుగులకు నీటిమట్టం చేరినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో అలుగు ద్వారా దిగువకు 1,894.62 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీటి అవసరాల కోసం 146 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వెల్లడించారు.

### ఉధృతంగా ప్రవహిస్తున్న మహారాజు వాగు

సంగారెడ్డికామారెడ్డి జిల్లాల సరిహద్దుల్లోని కల్హేర్ సమీపంలో మహారాజు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కాకివాగు, తోట్లవాగులు పొంగిపొర్లడంతో మహారాజు వాగులో వరద ప్రవాహం పెరిగింది. సుమారు 4,000 క్యూసెక్కుల నీటితో మహారాజు వాగు ఉధృతంగా ప్రవహిస్తూ దిగువన మంజీరా నదిలో కలుస్తోంది. బుధవారం ఉదయం నుంచి వాగు ఉధృతంగా ప్రవహించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ప్రవాహాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే వరద ప్రవాహం ప్రమాదకరంగా ఉండటంతో వాగులు, వంకలు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# ఎస్పీ శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ప్రసాదం పంపిణీ



**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 23:**



జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) డి.వి. శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పవనపుత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా స్థానిక ఎస్సై మధుకర్‌రెడ్డి పర్యవేక్షణలో భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. శివ్వంపేట మండల బిఆర్ఎస్ ప్రచార కార్యదర్శి బుద్ధుల బిక్షపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ ఎస్పీ శ్రీనివాసరావు ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. పవనపుత్ర వినాయకుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో పాటు పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఎస్పీ శ్రీనివాసరావుకు దొంతి గ్రామ ప్రజలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించిన బుద్ధుల బిక్షపతిని అభినందించారు.

# నవ సమాజ నిర్దేశకులు గురువులు

## - పటాన్‌చెరులో ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

## - 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం






**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి గదుల్లోనే జరుగుతుందని, ప్రతి విద్యార్థిని భావిభారత పౌరుడిగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించే కార్యక్రమాన్ని బుధవారం పటాన్‌చెరు డివిజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని కొనియాడారు. విద్యార్థులకు విద్యాబోధనతోపాటు నైతిక విలువలు, కుటుంబ బంధాలు, సామాజిక బాధ్యతలను తెలియజేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలను ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల మధ్య నెలకొన్న పోటీతో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని అభినందించారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి ప్రతి రంగంలోనూ పేరు తీసుకొచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు.

### 25 ఏళ్లుగా గురుపూజోత్సవం

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను గురుపూజోత్సవం సందర్భంగా గత 25 ఏళ్లుగా సన్మానించుకోవడం తనకు ఎంతో ఆనందంగా, అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అన్నారు.



### మొబైల్ వినియోగంపై అప్రమత్తత

ప్రస్తుత సమాజంలో మొబైల్ ఫోన్ లు వినియోగం ప్రమాదకరంగా మారుతోందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికతను అభివృద్ధికి ఉపయోగిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని, దుర్వినియోగం చేస్తే సమాజానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల చదువుతోపాటు వారి ప్రవర్తన, మానసిక స్థితిపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీ హబ్‌ను సందర్శించిన గీతం విద్యార్థినులు

## - వ్యవస్థాపకత, స్టార్టప్‌లపై అవగాహన
## - మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో పారిశ్రామిక సందర్శన






**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు బుధవారం హైదరాబాద్‌లోని వీ హబ్ ను సందర్శించారు. గీతం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారిశ్రామిక సందర్శనలో విద్యార్థినులకు వ్యవస్థాపకత, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించారు.మహిళా సాధికారత సెల్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థినులు, ఐదుగురు మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే రాష్ట్ర స్థాయి నోడల్ సంస్థగా పనిచేస్తున్న వీ హబ్ కార్యకలాపాలు, అక్కడ అందుతున్న పారిశ్రామిక సహకారం, మార్గదర్శకత్వం, నెట్‌వర్కింగ్, ఆవిష్కరణలు, వ్యాపార అభివృద్ధి అవకాశాలను విద్యార్థినులు తెలుసుకున్నారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను వాస్తవ ప్రపంచ పారిశ్రామిక విధానాలతో అనుసంధానించుకునే అవకాశం ఈ సందర్శన ద్వారా లభించిందని విద్యార్థినులు తెలిపారు. ముఖ్యంగా మహిళా నాయకత్వం, వ్యవస్థాపకత, సృజనాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కారం, వ్యాపార అవకాశాలను గుర్తించడం వంటి అంశాలపై అవగాహన పెరిగిందన్నారు.విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాల అన్వేషణతోపాటు స్వయం ఉపాధి, స్టార్టప్‌ల స్థాపన దిశగా ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పరిశ్రమల ఆధారిత కార్యక్రమాలు దోహదపడతాయని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ సందర్శన విద్యార్థినుల వృత్తిపరమైన, వ్యక్తిగత అభివృద్ధికి ఉపయోగపడే అనుభవాత్మక అభ్యాసంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో సీఎస్ఎస్ఈ విభాగం నుంచి జ్యోతి బంకాపల్లి, డాక్టర్ అపర్ణ, ఆర్కిటెక్చర్ విభాగం నుంచి డాక్టర్ సౌపూర్ణి పాల్, మనస్తత్వశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ దుర్గేష్ నందిని తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# వినాయక సన్నిధిలో జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

**నారాయణఖేడ్,సెప్టెంబర్ 23, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ మండలం సీతారాం తండాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గణనాథుని మండపం వద్ద భక్తుల కోసం జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుణ్ణపు మచ్చేందర్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నప్పటికీ, ఆయన ఆదేశాల మేరకు సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గణనాథుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా జీఎంఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, సర్పంచ్ బాబు సింగ్, చంద్ర నాయక్, విశ్వనాథ్ జాదవ్ తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# దంతాన్‌పల్లిలో ఘనంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు,హోమం

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 23:**

శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామంలోని హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద గురువారం వినాయకుడికి ప్రత్యేక పూజలు, హోమం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజేంద్రుల మమత నర్సింలు,రేషన్ డీలర్ గొల్ల గోపాల్,గొల్ల శేకులు,గొల్ల గణేష్‌తో పాటు గ్రామస్తులు గడ్డం వెంకట్రాములు,గడ్డం నరేష్,దుర్గం అంజనేయులు,నిమ్మల శ్రీను,నిమ్మల తిరుపతిరావు, గజేంద్రుల శంకర్,శ్రీశైలం,నాంచారి ప్రకాష్,యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.హనుమాన్ కమిటీ సభ్యులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం దుకాణాల మూసివేత

## - ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :-**



గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు తదితరాలను తాత్కాలికంగా మూసివేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ ఎక్సైజ్ చట్టం,1968లోని సెక్షన్ 20 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఏకానమీ పరిధిలోని ప్రాంతాలను మినహాయించి, సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని అన్ని ఏ4 మద్యం దుకాణాలు, 2-బి బార్లు, కల్లు దుకాణాలు/కల్లు డిపోలు, సిఎస్-2 క్యాంటీన్లు మూసివేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఈ మూసివేత 2026 సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం 6:00 గంటల నుంచి సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 6:00 గంటల వరకు అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో పాటు భారీ ఊరేగింపులు జరిగే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడం, ప్రజల భద్రతను కాపాడడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఉత్తర్వులను ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాల నిర్వాహకులు ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

# 13 ఏళ్ల నిరీక్షణకు తెర..
# జగ్గారెడ్డి కృషి తో భూములు కోల్పోయిన
# పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం వెలువడ్డ మొట్టమొదటి జి వో
- ఇళ్ల స్థలాల పంపిణీ  పై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనుండి కొనసాగుతున్న నిషేధం
- జగ్గారెడ్డి విజ్ఞప్తి మేరకు తొగర్ పల్లి లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం 13 ఏళ్ల లో రాష్ట్రం లో మొట్టమొదటిసారిగా విడుదలైన జి.వో
- తొగర్‌పల్లి సర్వే నం.418లో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి







**కొండాపూర్ ప్రజా జ్యోతి**

ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.

## 2011లో కేటాయింపులు.. ఆ తర్వాత నిలిచిన ప్రక్రియ

తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది.

## ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ

తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

13 ఏళ్ల నిరీక్షణకు తెర.. జగ్గారెడ్డి కృషి తో భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
ఇళ్ల స్థలాల పంపిణీ  పై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనుండి కొనసాగుతున్న నిషేధం
జగ్గారెడ్డి కోరిక మేరకు తొగర్ పల్లి లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం రాష్ట్రం లోనే మొట్టమొదటిసారిగా విడుదలైన జి.వో
తొగర్‌పల్లి సర్వే నం.418లో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి
ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.

## 2011లో కేటాయింపులు.. ఆ తర్వాత నిలిచిన ప్రక్రియ

తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వెలువడిన తొలి జి వో

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ స్కీమ్ తెచ్చిన నేపథ్యం లో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలాల కేటాయింపు పై నిషేధం విధించింది.  ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో సైతం ఇళ్ల స్థలాల పై అదే నిషేధం కొనసాగుతూ వస్తోంది. జగ్గారెడ్డి విజ్ఞప్తి మేరకు గత 13 ఏళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రం లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం తొలి జీవో విడుదలైంది.

## నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ

తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలా కేటాయింపు పై 13 ఏళ్లుగా నిషేధం ఉన్నా జగ్గారెడ్డి కృషి తో తొగర్ పల్లి లో ఇళ్ల స్థలాల కు పట్టాలు మంజూరు చేయడం సాధ్యం అయిందని నిర్మలా జగ్గారెడ్డి, అధికారులు గుర్తు చేశారు. తొగర్ పల్లి గ్రామానికి చెందిన 72 మంది, అలియాబాద్ గ్రామానికి చెందిన 21 మంది రైతులకు ఈరోజు పట్టాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, , కొండాపూర్, అలియాబాద్ గ్రామ సర్పంచులు, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డికి ఘనంగా శుభాకాంక్షలు. తెల్పిన కల్హేర్ మండల కాంగ్రెస్ ఇంచార్జ్ మలిదొడ్డి తుకారాం

- కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం..

పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత గుర్తింపు..

**కల్హేర్, సెప్టెంబర్ 23, ప్రజాజ్యోతి:** సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కృష్ణాపూర్ కు చెందిన ప్రముఖ కాంగ్రెస్ కార్యకర్తలు పూలమాలతో డిసిసి అధ్యక్షులు సన్మానించారు ఆయన మాట్లాడుతూ ఒకే పార్టీని నమ్ముకుని, పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ సముచిత గుర్తింపు, పదవులు కల్పిస్తుందని డీసీసీ అధ్యక్షుడు పి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పి. చంద్రశేఖర్ రెడ్డికి కృష్ణాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్హేర్ మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్దొడ్డి తుకారం, కృష్ణాపూర్ ఉపసర్పంచ్ రమేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు కమ్మరి మల్లేష్, మల్దొడ్డి విట్టల్, వార్డు సభ్యులు శీను, విట్టల్, దాడే బాలు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత పథకాలు కాదు.. ఉచిత విద్యను అందించాలి

- నవంబర్ 16, 17న ఎఐ ఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

- సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దిన్

**జహీరాబాద్, సెప్టెంబర్ 23(ప్రజా జ్యోతి న్యూస్)** పట్టణంలో నిర్వహించిన ఎఐ ఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దిన్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఉచిత పథకాలకే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చకుండా ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో కాషాయీ కరణను ప్రోత్సహించే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రిం చేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎఐ ఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాలను ఆయన అభినందించారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం మరింత ఐక్యంగా ఉద్యమించాలని ఎఐ ఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్త లకు పిలుపునిచ్చారు. విద్య ప్రతి



విద్యార్థికి హక్కుగా అందేలా ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని సయ్యద్ జలాలుద్దిన్ స్పష్టం చేశారు. అనంతరం నవంబర్ 16, 17 తేదీల్లో సంగారెడ్డి పట్టణం లో ఎఐ ఎస్ఎఫ్ సంగారెడ్డి జిల్లా మహాసభలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. మహాసభలను విజయ వంతం చేసేందుకు ఎఐ ఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఆనంద్, రెహమాన్, ఎఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి, జిల్లా నాయకులు అశోక్, ప్రశాంత్, అజమ్, నర్సింహులు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల వినతి..

- ఏళ్లుగా జర్నలిజం వృత్తినే నమ్ముకుని ప్రజల తరఫున పనిచేస్తున్నాం.

టిజిఐఐసి చైర్మన్, తహసీల్దార్,

ఆత్మ కమిటీ చైర్మన్‌కు కొండాపూర్ మీడియా మిత్రుల విజ్ఞప్తి..



**కొండాపూర్ ప్రజా జ్యోతి**

కొండాపూర్ మండలంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులుగా సేవలందిస్తున్న అర్హులైన మీడియా ప్రతినిధులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ టి జి ఐ ఐ సి చైర్మన్, నిర్మల జగ్గారెడ్డి, తహసీల్దార్ అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, కు కొండాపూర్ మండల మీడియా మిత్రులు వినతిపత్రం అందజేశారు.

**ఈ సందర్భంగా మీడియా మిత్రులు మాట్లాడుతూ..**

గత పదేళ్లుగా ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గతంలో కొండాపూర్ మండలానికి చెందిన కొందరు మీడియా మిత్రులకు తొగర్పల్లి శివారులో ఇళ్ల స్థలాలు కేటాయించిన నేపథ్యంలో, అదే విధంగా ప్రస్తుతం అర్హత కలిగిన జర్నలిస్టులకు కూడా తొగర్పల్లి గ్రామంలో స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏళ్లుగా జర్నలిజం వృత్తినే నమ్ముకుని ప్రజల తరఫున పనిచేస్తున్నాం.. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలం అందేలా అధికారులు చొరవ చూపాలి" అని వారు కోరారు. తమ విజ్ఞప్తిని అధికారులు సానుకూలంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు తొగర్పల్లిలో శివారులో ఇళ్ల స్థలాలు కేటాయించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తమ సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని మీడియా మిత్రులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ర సూర్య రిపోర్టర్ రాజు,



ప్రజావాణి రిపోర్టర్ అనంతయ్య, ప్రజాపక్షం రిపోర్టర్ శ్రీకాంత్ రెడ్డి, విజన్ ఆంధ్ర రిపోర్టర్ శేఖర్, నవతెలంగాణ రిపోర్టర్ అనిల్, జ్ఞాన తెలంగాణ రిపోర్టర్ శ్యామ్ ప్రసాద్, జనం సాక్షి రిపోర్టర్ బాలయ్య, మనం రిపోర్టర్ నర్సింలు, ఉన్నారు.

# మన్నాన్పల్లి సర్వే నంబర్ 189లో జోరుగా నిర్మాణ పనులు!

## - అనుమతులు లేకుండానే దాబా నిర్మాణం..

## - ప్రభుత్వ భూమి, ప్రొహిబిటెడ్ లిస్ట్, కోర్టు కేసు పరిధిలో ఉన్న ప్రాంతమంటూ ఆరోపణలు..

## - అనుమతులు లేకుండానే ఫామ్ హౌస్ నిర్మాణ పనులు..

## - అక్రమ నిర్మాణాలపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

కొండాపూర్ మండలం మన్నాన్పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 189లో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు సర్వే నంబర్‌లో సుమారు పదేళ్ల క్రితమే అనుమతులు లేకుండా దాబా నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, సదరు భూమికి సంబంధించి ప్రభుత్వ కంచె, ప్రొహిబిటెడ్ లిస్ట్, కోర్టు కేసు వంటి అంశాలు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించి భూమి హక్కులు, అనుమతులు, నిర్మాణాల చట్టబద్ధతపై సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఇకనైనా అధికారులు స్పందిస్తారా?

అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై



అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చట్టప్రకారం నిర్మాణ పనులను నిలిపివేసి తగిన చర్యలు తీసుకుంటారా? లేక ఇదే విధంగా పనులు కొనసాగుతాయా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు లేదా కోర్టు వివాదాల్లో ఉన్న



స్థలాల విషయంలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# పైసా పైసా కూడబెట్టి కొంటే.. ప్లాట్లు మింగేశారు

## - రుద్రారంలో జీపీఆర్ లేఅవుట్ బాధితుల గగ్గోలు

## - 2004లో కొనుగోలు చేసిన స్థలాలపై ఇప్పుడు వివాదం

## - రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చారంటూ ఆరోపణలు





**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

జీవితకాల సంపాదనను వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసుకున్నా.. ఏళ్ల తర్వాత తమ ఆస్తులపై హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని రుద్రారం సాయినాథ్ గార్డెన్స్ ప్లాట్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చట్టబద్ధంగా ఉన్న ప్లాట్లను రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లకు మళ్లించారని ఆరోపిస్తూ పటాన్ చెరు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తమ ప్లాట్లను తిరిగి తమకు అప్పగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### 2004లో కొనుగోలు.. నేడు వివాదం

బాధితుల కథనం ప్రకారం.. రుద్రారం సాయినాథ్ గార్డెన్స్‌లో 2004లో పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. అప్పట్లో చట్టబద్ధంగా కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ లు కూడా చేసుకున్నామని తెలిపారు. అయితే కాలక్రమంలో తమ ప్లాట్లకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఎల్ఎస్ఎంఎల్ కంపెనీ పేరుతో పట్టా పాస్‌బుక్కులు జారీ చేసి తమ హక్కులను దారి మళ్లించారని పేర్కొన్నారు.

### అధికారుల చుట్టూ దశాబ్దాలుగా ప్రదక్షిణలు

తమ ఆస్తుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని బాధితులు తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా సమస్య కొలిక్కి రాలేదని వాపోయారు. తమ కళ్ల ముందే తమ ఆస్తులపై హక్కులు ప్రశ్నార్థకంగా మారడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందన్నారు.

### మోటేషన్లపై విచారణ జరపాలి

తమ ప్లాట్లకు సంబంధించిన రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టా పాస్‌బుక్కులు, మోటేషన్ వివరాలను సమగ్రంగా పరిశీలించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఎవరి ఆదేశాలతో రికార్డుల్లో మార్పులు జరిగాయి? ఏ ఆధారాలతో పట్టా పాస్‌బుక్కులు జారీ చేశారు? అనే అంశాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరారు. తప్పులు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### న్యాయం జరిగే వరకు పోరాటం

తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని బాధితులు స్పష్టం చేశారు. జీవితకాల పొదుపులతో కొనుగోలు చేసిన ప్లాట్లను కోల్పోయే పరిస్థితి నుంచి తమను కాపాడాలని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను కోరారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి రికార్డులను పరిశీలించి అసలు హక్కుదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ అండ

## 22 కుటుంబాలకు

## రూ.8.67 లక్షల ఆర్థిక సాయం

**వట్‌పల్లి, సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):**

అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. వట్‌పల్లి మండలంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో 22 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 8.67 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. వైద్య చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆపద సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వజనాల విశ్వాస్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ పాటిల్, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రుక్మొద్దీన్, సీనియర్ నాయకులు వీరారెడ్డి, ప్రశాంత్ పటేల్, సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి, లింగారెడ్డి, రాణి మహిపాల్, మండల నాయకులు హబీబ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కళ్యాణ్, రాహుల్, అలీమ్, ఖదీర్, ఇస్మాయిల్, రాజు, పాపయ్య, నాగయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వెల్ డన్ యాదగిరి ..!జర్నలిస్టుల రక్తదాన శిబిరం గ్రేట్

## అభినందించిన జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కారం

## - ప్రశంసా పత్రం అందజేత







**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

వెల్ డన్ యాదగిరి.. గుడ్ జాబ్ అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందించారు. నేనే మీకు శాలువా కప్పాలి అంటూ శాలువాతో సత్కరించారు. రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని యాదగిరి కి అందజేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూ జే-ఐజేయు) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదిన పురస్కరించుకొని మంగళవారం పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొనాల్సి ఉన్నది. అత్యవసర పనుల వల్ల ఆయన పాల్గొనలేకపోయారు. దీంతో బుధవారం నాడు జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ను కలిశారు. నోట పుస్తకాలను అందించారు. రక్తదాన శిబిరం ద్వారా సమాజానికి సేవా నిరతి ని చాటి చెప్పడం గ్రేట్ అని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి మెసేజ్ వెళుతుందని అన్నారు. పుట్టినరోజునాడు కేక్ కటింగ్ తో వేడుకలు జరపకుండా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిత్యం సమాజంలోని వార్తలను వెలికి తీస్తున్న జర్నలిస్టుల ద్వారా ఇలాంటి కార్యక్రమాలు జరగడం మరింత శుభ సూచకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజేఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ తమ యూనియన్ మొదటి నుంచి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే ఫైసల్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులను సాధించడానికి అనేక పోరాటాలు చేశామని వివరించారు. మున్ముందు కూడా తమవంతుగా సామాజిక సేవలో పాల్గొంటామని ఈ సందర్భంగా యాదగిరి పేర్కొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ( డిపిఆర్ఓ) విజయలక్ష్మి కూడా ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరిని అభినందించారు. రక్తదానం ద్వారా ప్రమాదంలో ఉన్న వారికి మేలు కలుగుతుందన్నారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచిదన్నారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రభాకర్, చిన్నా మధ్యతరగతి పత్రికల సంఘం ఉపాధ్యక్షుడు నజీర్, కోశాధికారి లక్ష్మణ్, రథసారథి సీఈవో సంతోష్ గౌడ్, ఆంధ్రజ్యోతి శ్రీకాంత్, టీయూడబ్ల్యూజేఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్, విజయ రాజు, మహేష్ ,శ్రీకాంత్, సాక్ష్యం శ్రీనివాస్, నవీన్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

## వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 'గణపతి బప్పా మోరియా' నినాదాలు

**కల్హేర్, సెప్టెంబర్ 23: ప్రజా జ్యోతి.**

కల్హేర్ మండలం బీబీపేట గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవ శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వర్షం అంతరాయం కలిగించినప్పటికీ భక్తులు ఉత్సాహాన్ని వీడకుండా గణనాథుడి శోభాయాత్రను కొనసాగించారు. మహిళల కోలాటాలు, యువకుల ఉత్సాహభరిత నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరాఠీ, తెలుగు సంప్రదాయ భజనలు, కీర్తనలతో భక్తులు గణనాథుడిని స్మరించగా, 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో గ్రామ వీధులు మార్మోగాయి. భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి వీడ్కోలు పలికారు. ఆధ్యాత్మిక సద్భావన, భక్తి భావంతో శోభాయాత్ర కొనసాగింది.

**భారీ వర్షంతో పలు చోట్ల నిమజ్జనానికి ఆటంకం**

కల్హేర్ మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో వినాయక నిమజ్జన శోభాయాత్రలకు ఆటంకం ఏర్పడింది. అకస్మాత్తుగా వర్షం ముంచెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో ఉత్సవాలను కొంతసేపు నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో భక్తులు, ఉత్సవ నిర్వాహకులు



ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**మార్డిలో 'ఇరుముడి' సినిమా ప్రదర్శన**

కల్హేర్: మండలంలోని మార్డి గ్రామంలో బజరంగ్ఎళ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ మండపం వద్ద 'ఇరుముడి' సినిమాను ప్రదర్శించారు. తండ్రికూతురు మధ్య ఉన్న ప్రేమాభిమానాలను ప్రధానంగా చూపించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కూతురు తండ్రిపై చూపించే ప్రేమ, తండ్రి కూతురిపై చూపించే ఆప్యాయతను భావోద్వేగంగా తెరకెక్కించడంతో ప్రేక్షకులు



ఆసక్తిగా వీక్షించారు. సినిమా ప్రదర్శనకు యువత, గ్రామస్థులు హాజరయ్యారు.

# జిమ్ వైపు యువత అడుగులు.. ఆరోగ్యమే లక్ష్యంగా కొత్త ట్రెండ్

## - ఫిట్‌నెస్‌పై పెరుగుతున్న ఆసక్తి..

## - వ్యాయామంతో ఆరోగ్యకరమైన జీవనశైలికి శ్రీకారం

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

ఒకప్పుడు జిమ్ అంటే కేవలం కండలు పెంచుకునే యువత మాత్రమే గుర్తుకు వచ్చేది. కానీ కాలం మారింది. ప్రస్తుత యువత ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చింది. అందం, శరీరాకృతితో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి వ్యాయామం ఎంతో అవసరం అని యువత గుర్తిస్తోంది. దీంతో పట్టణాలు, నగరాల్లో జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లకు వెళ్లే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

**ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో..**

ప్రస్తుత రోజుల్లో మారుతున్న ఆహారపు అలవాట్లు, ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం, మొబైల్, కంప్యూటర్ల వినియోగం వంటి కారణాలతో శారీరక శ్రమ తగ్గుతోంది. దీంతో చిన్న వయసులోనే బరువు పెరగడం, అలసట, ఒత్తిడి వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో యువత తమ జీవనశైలిలో వ్యాయామాన్ని ఒక భాగంగా మార్చుకుంటోంది.

**శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉత్సాహం**

జిమ్‌లో వ్యాయామం చేయడం వల్ల కేవలం శరీరాకృతి మెరుగుపడటమే కాకుండా చురుకుదనం, ఆత్మవిశ్వాసం పెరగడానికి సహాయపడుతుంది. రోజువారీ ఒత్తిడిని తగ్గించుకోవడానికి కూడా వ్యాయామం ఉపయోగపడుతుంది. ఉదయం లేదా సాయంత్రం కొంత సమయాన్ని వర్కౌట్‌కు కేటాయించడం ద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు యువత ప్రయత్నిస్తోంది.

**జిమ్.. యువతలో ఒక ఫిట్‌నెస్ కల్చర్**


సోషల్ మీడియా ప్రభావం కూడా యువతలో ఫిట్‌నెస్‌పై ఆసక్తిని పెంచుతోంది. ఫిట్‌గా ఉండే యువతను చూసి మరికొందరు కూడా వ్యాయామం వైపు ఆకర్షితులవుతున్నారు. అయితే కేవలం శరీరాకృతిపై కాకుండా ఆరోగ్యాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకుని శాస్త్రీయ పద్ధతిలో వ్యాయామం చేయడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**వ్యాయామంతో పాటు ఆహారం కూడా ముఖ్యం**

జిమ్‌కు వెళ్లడం ఒక్కటే సరిపోదు. సరైన పోషకాహారం, తగినంత నిద్ర, తగిన విశ్రాంతి కూడా అవసరం. తమ శరీర సామర్థ్యాన్ని బట్టి వ్యాయామం ఎంచుకోవడంతో పాటు, అవసరమైతే నిపుణుల సూచనలు తీసుకోవాలి. అతిగా వ్యాయామం చేయడం లేదా ఇతరులను చూసి అదే విధంగా చేయడం కంటే వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ఫిట్‌నెస్ ప్రణాళిక రూపొందించుకోవడం మంచిది.

**ఆరోగ్యవంతమైన సమాజానికి యువతే బలం**

నేటి యువతలో పెరుగుతున్న ఫిట్‌నెస్ ఆసక్తి మంచి పరిణామంగా చెప్పవచ్చు. యువత ఆరోగ్యంపై శ్రద్ధ పెడితే అది వారి వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజానికి కూడా ఉపయోగ కరంగా మారుతుంది. డబ్బు, ఉద్యోగం, పేరు ప్రతిష్ఠలు ఎంత ముఖ్యమో.. వాటిని ఆస్వాదించడానికి ఆరోగ్యం అంతకంటే ముఖ్యం. అందుకే “ఆరోగ్యమే మహాభాగ్యం” అనే మాటను ఆచరణలో పెడుతూ జిమ్, వ్యాయామం వైపు యువత వేస్తున్న అడుగులు ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయి.




# పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం

## - గర్భిణులకు పోషణ మాసంపై అవగాహన.. శ్రీమంతం నిర్వహణ







**వట్‌పల్లి, సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):**

గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సూచించారు. వట్‌పల్లి మండలంలోని రైతు వేదికలో బుధవారం పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, ఇనుము, కాల్షియం, ఫోలిక్ యాసిడ్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు అందుతాయని వివరించారు. వీటి ద్వారా రక్తహీనతను నివారించడంతో పాటు నెలలు నిండకముందే ప్రసవం, ప్రీ-క్లాంప్సియా వంటి సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆకుకూరలు, పండ్లలో ఉండే పీచు పదార్థం మలబద్ధకం సమస్యను నివారించడంతో పాటు కంటి చూపు, ఎముకల ఆరోగ్యానికి దోహదపడుతుందని తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్రసాద్ ఆధ్వర్యంలో గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణీలను ఆశీర్వదించి, పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. పోషణ మాసం లక్ష్యాలను ప్రతి తల్లి వరకు తీసుకెళ్లేందుకు అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ మాధులిక, రత్నకుమారి, ఎమ్మార్వో జగదీష్, వట్‌పల్లి సర్పంచ్ రవీందర్, యువజన అధ్యక్షుడు వెంకట్‌రావు, దిగంబరావు, మాజీ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి అంగన్వాడీ సిబ్బంది, ఆయాలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరసింహ గౌడ్ తల్లి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సంతాపం, పరామర్శ

## కల్హేర్‌లో నివాళులు;

## కుటుంబ సభ్యులకు ధైర్యం

**కల్హేర్, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):**

కల్హేర్ మండల కేంద్రానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ర్యాకల నరసింహ గౌడ్ తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, నరసింహ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సంగప్ప, మాజీ ఉపసర్పంచ్ సాయిలు, ప్రభు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# భక్తి సందడిలో.. గణనాథుడికి వీడ్కోలు

## తొమ్మిది రోజుల ఉత్సవాలకు ఘన ముగింపు

**అందోల్, సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):**

జోగిపేట మాణిక్ ప్రభు మందిరంలో తొమ్మిది రోజులుగా కొనసాగిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తుల కోలాహలం మధ్య ఘనంగా ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన నిమజ్జన వేడుకలు భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలతో ఉత్సాహభరితంగా సాగాయి.మాణిక్ ప్రభు మందిరం రమణ పంతులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ప్రతిరోజూ భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ రేఖా ప్రవీణ్‌కుమార్ భక్తులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాందేడ్ నుంచి వచ్చిన కళాకారుల భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.నిమజ్జన కార్యక్రమానికి మాజీ చైర్మన్ కవిత సురేందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణారెడ్డి, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన భోజన, తాంబూల కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తుల నినాదాలు, కళాకారుల ప్రదర్శనల నడుమ గణనాథుడి ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. దీంతో మాణిక్ ప్రభు మందిరంలో సాగిన గణేష్ నవరాత్రి వేడుకలకు ఘనంగా తెరపడింది.



# టవర్స్ కాలనీలో ఘనంగా వినాయకుడి నిమజ్జనం

**రాయికోడ్ సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని టవర్స్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో పెద్ద లడ్డూను నట్కారి నవీన్ రూ. 17,001 కి దక్కించుకోగా, చిన్న లడ్డూను గౌని నరసింహులు రూ. 8,050లకు వేలంలో దక్కించుకున్నారు. నిర్వాహకులు వారికి ఘనంగా సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.నిమజ్జన కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు శివశంకర్, గణేష్, రవి, ప్రవీణ్, జగదీష్, వినయ్ కుమార్, ఎం. మధు, రమేష్‌తో పాటు పూజారి శివ స్వామి, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యువత, భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు.



# జోగిపేటలో నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు

## - బారికేడ్లు.. వెలుగులు.. క్రేన్లు సిద్ధం ।

## భక్తుల సౌకర్యమే లక్ష్యంగా పురపాలక సంఘం చర్యలు

**అందోల్, సెప్టెంబర్ 23, (ప్రజాజ్యోతి):**



వినాయక నవరాత్రుల వేడుకలు ముగింపు దశకు చేరుకోవడంతో గణనాథుల నిమజ్జనానికి జోగిపేట పురపాలక సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. నిమజ్జన ప్రదేశంలో బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంది. రాత్రివేళల్లోనూ నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసింది.భారీ విగ్రహాలను సైతం సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు క్రేన్లను సిద్ధం చేయడం ద్వారా పురపాలక యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. నిమజ్జన సమయంలో భక్తులు, నిర్వాహకులు ఇబ్బందులు పడకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచింది. తొలి గణపయ్య నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్లను మునిసిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, కమిషనర్ తిరుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలిస్తూ సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, క్రమబద్ధంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల భద్రత, నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగడమే ప్రధాన లక్ష్యంగా పురపాలక అధికారులు చర్యలు చేపట్టారు.తొలి గణపయ్య నిమజ్జనం సందర్భంగా మాజీ కౌన్సిలర్లు నాగరాజ్, పిట్ల లక్ష్మణ్, తుపాకుల సునీల్, పెట్లోళ్ల ప్రవీణ్‌తో పాటు మునిసిపల్ సిబ్బంది లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## - అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి:

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, ప్రజా జ్యోతి ప్రతినిధి:-**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ సంగీతతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్కింగ్ కాని, అనామలీ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాల పరిశీలనను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాల నిర్ధారణ కోసం 12 రకాల గుర్తింపు/ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు హాజరై అవసరమైన ధ్రువపత్రాలు, వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా అవగాహన కల్పించి సహకరించాలని కోరారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు.జిల్లాలో మొత్తం 4,11,717 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 2,48,395 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలను కలెక్టర్ స్వీకరించారు. హియరింగ్ ప్రక్రియకు సంబంధించి ఎటువంటి సమస్యలు లేవని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు..

# వి ఎస్ పి పరిశ్రమలో ఐటీ సోదాలు

**హత్నూర 23సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలో చందాపూర్ గ్రామ శివారులోని వీఎస్పీ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ స్టీల్ పరిశ్రమలో ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహిస్తున్నారు.బుధవారం ఉదయం సుమారు 5 గంటల నుంచి అధికారులు పరిశ్రమలోకి చేరుకుని తనిఖీలు ప్రారంభించారు.పరిశ్రమకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, రికార్డులు,కీలక పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.అయితే ఈ సోదాలు ఏ అంశానికి సంబంధించి చేపడుతున్నారనే దానిపై అధికారులు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు.ఉదయం నుంచి సోదాలు నిరంతరాయంగా కొనసాగుతుండటంతో పరిశ్రమ పరిసరాల్లో ఉత్కంఠ నెలకొంది.సోదాలు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.